సింగిల్ పేజీ కథ

# భ్రమణం

- విశాలవియోగి

"ఏరా! ఆ అమ్మాయి ఎలా ఉంది?" అడిగాడు రవణ... అనంతమూర్తిని.

"ఫర్వాలేదు" చప్పరించేశాడు అనంతం.

'అంటే... బాగోలేదనా?" కోపంగా అడిగాడు రవణ.

"ఫర్వాలేదు" మళ్ళీ చెప్పాడు అనంతం తలవంచుకుని.

"హుఁ! నీకు ఎటువంటి అమ్మాయి నచ్చుతుందిరా? నీకోసం రంభ, ఊర్వశి, మేనక స్వర్గంలోంచి దిగివస్తారనుకుంటున్నావా? నీమొహం ఎప్పుడన్నా అద్దంలో చూసుకున్నావా?" రవణ తనని తాను కంట్రోలు చేసుకోలేకపోయాడు.

అనంతమూర్తి ఓ బ్రహ్మచారి. అతను బ్రహ్మచర్య దీక్ష పూనాడని కాదు... తగిన వధువు దొరక్క అలా ముదిరిపోతున్న బెండకాయలా ఉరడిపోయాడు. మొన్ననే అనంతం దిగ్విజయంగా తన నూరవ సంబంధం చూసి వచ్చాడు. ఆ సందర్భంలో రవణ వాకబు చేశాడు.



"అమ్మాయి అందంగాలేదని నేను అన్లేదురా! సంబంధం ఫర్వాలేదన్నా... అంతే!" వివరించాడు అనంతమూర్తి.

"అంటే... అమ్మాయి వేరూ... సంబంధం వేరూ... అమ్మాయి అందం వేరూ... నచ్చడం వేరూ... ఏమిటో నీ మాటలు అర్థం కావట్లేదు!" విస్తుపోతూ అన్నాడు రవణ.

"ఏం చెప్పమంటావురా? ఆ అమ్మాయి పనిచేసేది ఓ కాలేజీలో... అదీ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా... ఆమెకు ట్రాన్స్‌ఫర్లు ఉండవట... నేను ఆఫీసరైతే... ట్రాన్స్‌ఫర్లు తప్పవు. గుళ్ళో లింగంలా ఒకే ఊళ్ళో ఎలా ఉండగలను. అందుకే..."

"ఛీఁ! భవిష్యత్తు గురించి ఎందుకు భయపడతావు...? నీకెలాగూ ఆ ఊరికి ట్రాన్స్‌ఫర్ వస్తుంది కదా...ఆ తర్వాత సంగతి దేవుడున్నాడు.." నచ్చ చెప్పబోయాడు రవణ.

అనంతమూర్తి బాగా ఆలోచించాడు...

మహా అయితే ఓ రెండేళ్ళు తననా ఊళ్ళో ఉంచుతారు. ఆ తర్వాత ఇంకెక్కడికైనా ఎత్తివేస్తారు... అప్ అండ్ డౌన్ చేయాలి... ఆమెకు నో ట్రాన్స్‌ఫర్... సుదీర్ఘంగా ఆలోచిస్తే... ఆమెను చేసుకుని తను సుఖపడలేడు అనిపిస్తోంది...

అనంతం తన ఆలోచన తెలిపాడు రవణకు.

"నీలా ఎక్కువ ఆలోచించే వాడూ... అసలు ఆలోచించని వాడూ ఎప్పటికీ సుఖపడలేరు... నీ ఖర్మ ఇంతేరా!"అంటూ రవణ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు రవణ వేరే ఊరిక బదిలీ అయివెళ్ళిపోయాడు.

ఓ రెండేళ్ళ తర్వాత అనంతమూర్తిని కలిశాడు రవణ.

"హలో, ఎంతమంది పిల్లలు?" రవణ అడిగాడు.

"అరే! నాకింకా పెళ్ళే కాలేదు!" చెప్పాడు అనంతం.

"ఓర్నీ! పిలవకుండా.. చేసు కున్నావనుకున్నాను... కానీ... ఇలాచేస్తావనుకో లేదు" బోల్డు బాధపడ్డాడు.

"మీ ఆఫీసులో ఓ అమ్మాయి పనిచేస్తోందిట కదా!"

"అమ్మాయేమిటి... అమ్మాయిలు అను.... ఇంతకీ ఎవరా అమ్మాయి?"

"రాధ అనుకుంటా... ఆ అమ్మాయిని ట్రైచెయ్యి గురూ...'కానీ' కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటా" చెప్పాడు అనంతం.

"కానీ ఆ అమ్మాయి చిన్నపిల్లనుకుంటా... వయసు నీకు సరిపోదేమో! సందేహించాడు.

"ప్లీజ్! నా కభ్యంతరం లేదు..." బ్రతిమాలాడు.

మర్నాడు రవణ రాధను పక్కకు పిలిచి మూర్తి గురించి చెప్పాడు.

ఉన్నట్టుండి రాధ నవ్వింది... పకపకా నవ్వింది... పగలబడి నవ్వింది. రవణ అయోమయంగా ఆమె వంక చూశాడు...

"నాకా... పెళ్ళా... అదీ మీఫ్రెండ్ అనంతమూర్తితోనా! మీకో సంగతి తెల్సా? అతనికి సరైన వయసులో పెళ్ళయితే... నా అంత కూతురు ఉండేది..." రాధ చెప్పింది.

"అఫ్‌కోర్స్... అది అతని దురదృష్టం... కాని ఈకాలంలో ఆడ పిల్ల పెళ్ళిళ్ళుకావడం ఎంత కష్టంగా ఉన్నాయో మీకు తెల్సుగా... మీరు బోల్డంత కట్నం ఇవ్వాలి... అతను కట్నం కూడా తీసుకోనంటున్నాడు" అతని మాట పూర్తికాకుండానే ఆమె అందుకుంది...

"కత్తి ఊరికే వస్తుందని పీక కోసుకుంటామా?'

మర్నాడు కల్సిన అనంతమూర్తికి, రాధ తిరస్కరించిన వైనం చెప్పాడు రవణ.

అనంతమూర్తికి కోపం బుసలుకొట్టింది.

"హుఁ! ఎంత పొగరు... ఆమెకు పెళ్ళికాలేదని జాలిపడి మగవాడి నన్న అహంవదలి ముందుకొస్తే తిరస్కరిస్తుందా? ఛీఁ!"

'అంతే మూర్తీ! ఏ ఆడపిల్లయినా మనచుట్టూ తిరిగేది కొంతకాలం వరకే... ఆ తర్వాత మనం ఎంత తిరిగినా వాళ్ళు తిరస్కరిస్తారు...అప్పుడు మన డిమాండ్‌పోతుంది" చెప్పాడు రవణ.